నమస్తే తెలంగాణ


నల్లగొండ

5 | నల్లగొండ, సోమవారం 6 మే 2024 | NALGONDA


## రేవంత్ ఇచ్చింది రైతు భరోసా కాదు.. రైతు బంధు

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

చివ్వెంల, మే 5 : రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు ఇచ్చింది రైతు భరోసా కాదు.. రైతు బంధు మాత్రమేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఉండ్రుగొండ, వల్లభాపురం, గుంపుల, జి.తిరుమలగిరి, గుంజలూరు గ్రామాల్లో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక్క రైతుకైనా రైతు భరోసా ఇచ్చినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ముక్కు నేలకు రాస్తానని సవాల్ చేశారు. ఐదు నెలల కాంగ్రెస్ పాలనలో రైతులు అప్పుల పాలయ్యారని ఆరోపించారు. కేసీఆర్ రైతుల కోసం రూ.7500 కోట్లు సిద్ధం చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు పంచి పెట్టిందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి మాటలు చూస్తుంటే జాలేస్తుందని, నాలుగు నెలల్లో ఇంత ఘోరంగా విఫలమైన ముఖ్యమంత్రి దేశంలో ఎవరూ లేరని అన్నారు. రేవంత్‌రెడ్డి అడ్డగోలు మాటలతో కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ 10 శాతానికి పడిపోయిందని, పోలింగ్ నాటికి రోజుకు ఒక శాతం చొప్పున పడిపోతుందని పేర్కొన్నారు. మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, జడ్పీటీసీ భూక్యా సంజీవ్‌నాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జూలకంటి జీవన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మారినేని సుధీర్‌రావు, నాయకులు నర్సింహారావు, బాబూనాయక్, సాగర్, గోవిందరెడ్డి, అనిల్ యాదవ్, షేక్ బాషా పాల్గొన్నారు.



నల్లగొండలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

# 4నెలల్లోనే రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు

- ఒక్క పంటకు నీళ్లు ఇవ్వలేక లక్షల ఎకరాలు ఎండబెట్టారు
- రైతాంగానికి నాణ్యమైన విద్యుత్ అందించిన ఘనత కేసీఆర్‌దే
- చేతకాని కాంగ్రెస్ పాలన గురించి ప్రజలే వివరిస్తున్నారు
- బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు తథ్యం
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



చివ్వెంల : గుంపుల గ్రామంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

నేరేడుచర్ల, మే 5 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాలుగు నెలల్లోనే భ్రష్టు పట్టించిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. నేరేడుచర్ల మండలంలోని దిర్శించర్ల గ్రామంలో ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను కొనసాగించలేక చతికిలబడ్డారని, సాగు నీరు ఇవ్వలేక పొలాలను ఎండబెట్టారని అన్నారు. గతంలో సాగర్‌లో 508, 510 అడుగుల నీటిమట్టం ఉన్నా పంటలకు నీటిని విడుదల చేసి రైతన్నలకు అండగా నిలిచామని తెలిపారు. హుజూర్‌నగర్ ఎమ్మెల్యే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీటి పారుదల శాఖ మంత్రిగా ఉండి కూడా సాగర్‌లో 515 అడుగులకు పైగా నీరు ఉన్నా పొలాలకు నీటిని విడుదల చేయలేదన్నారు. కాంగ్రెస్ 70 ఏండ్ల నుంచి కూడా రైతుల మీద కపట ప్రేమ చూపిస్తుందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో తొమ్మిదేండ్ల పాటు గృహాలకు, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ అందించడంతోపాటు 5 సంవత్సరాలు వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందించి రైతులకు అండగా నిలిచామని తెలిపారు. చేతకాని కాంగ్రెస్ పాలనలో విద్యుత్ కష్టాలు మొదలయ్యాయని, గతంలో ఉన్న విద్యుత్ ఇప్పుడు ఎందుకు ఉండడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ చేతగానితనం, పైసలు ఖర్చు చేయకుండా విద్యుత్ కోతలు సృష్టిస్తున్నారని అన్నారు. మంత్రులు పాల్గొన్న సమావేశాల్లోనే విద్యుత్ కోతలు ఉంటున్నాయని ఎద్దేవా చేశారు. గ్రామాలకు వెళ్తే ప్రజలే కాంగ్రెస్ లోపాల గురించి వివరిస్తున్నారని, నాలుగు నెలల్లోనే వారి పాలన గురించి అర్థమైందని అన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎంత బుకాయించాలని చూసినా ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన ఉండి పోరాడుతుందన్నారు. రైతు భరోసా ఇస్తామని చెప్పి రైతులను మోసం చేశారని విమర్శించారు. స్వయానా వ్యవసాయ శాఖ మంత్రే ఉద్యోగులకు ప్రతి నెలా మొదటి తేదీన జీతాలు ఇవ్వాలి.. ఇప్పుడు రైతు బంధు ఇవ్వలేమని చెప్పారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఏదీ సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. రూ.2లక్షల రుణమాఫీ, 4వేల పింఛన్, ఉచిత విద్యుత్, వడ్లకు రూ.500 బోనస్, మహిళలకు రూ.2500 ఎక్కడ ఇస్తున్నారని ప్రశ్నించారు. కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం దేవుడికి ఎరుక.. కనీసం రూ.లక్ష కూడా ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులకు చేతకాక పోలీసులను అడ్డుపెట్టుకొని పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతూ ఇబ్బందులు పెడుతున్నారని, అయినా భయపడేది లేదని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ఎలా ఉంది.. కాంగ్రెస్ పాలనలో ఎలా ఉందో సాగర్ ఆయకట్టు రైతులకు అర్థమైందన్నారు. అలాంటి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు ఆయకట్టు రైతులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. హుజూర్‌నగర్, సాగర్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు మంచి మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఉద్యమ స్ఫూర్తితో పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్లమెంటు ఎన్నికల సమన్వయ కమిటీ ఇన్‌చార్జి ఒంటెద్దు నర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అరిబండి సురేశ్‌బాబు, నాయకులు చన్నబోయిన సైదులు, చందమళ్ల జయబాబు, పంగ శ్రీను, రాపోలు నవీన్, యల్లబోయిన లింగయ్య, సైదులు, నాగరాజు, వెంకటేశ్వర్లు, శ్రీను, అంజమ్మ పాల్గొన్నారు.

## పాలనను పట్టించుకోని కాంగ్రెస్

- బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

నల్లగొండ, మే 5 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి పాలనను సరిగ్గా పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ గెలిస్తేనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేస్తుందని, లేదంటే వాటిని తుంగలో తొక్కుతుందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి పట్టణంలోని ఎన్జీ కళాశాల ఆవరణలో ఆదివారం ఉదయం మార్నింగ్ వాకర్స్‌ను ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం, మంత్రులు బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేయడం తప్ప.. పాలన గురించి పట్టించుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్ ఎంపీలు గెలిస్తేనే ఈ ప్రభుత్వం నిద్ర లేచి ఇచ్చిన హామీలు నెరవేర్చే అవకాశం ఉన్నదని, లేదంటే పూర్తిగా వదిలేస్తుందని పేర్కొన్నారు. తాను నాయకుడిని కాదు.. సేవకుడినని ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం టీ కొట్టులో చాయ్ చేసి పోశారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీర పంకజ్ యాదవ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, నాయకులు లొడంగి గోవర్ధన్, మెరుగు గోపి, రావుల శ్రీనివాస్‌రెడ్డి, వీరాచారి, రాజేందర్, రమేశ్, భాస్కర్, అమర్, సతీశ్, కిరణ్, సురేశ్ పాల్గొన్నారు.



పెద్ద అడిశర్లపల్లి మండలం అజ్మాపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

పెద్దఅడిశర్లపల్లి మే 5 : సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అజ్మాపురం గ్రామంలో ఆదివారం ఆయన ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రకుమార్ మాట్లాడుతూ పదేండ్లలో లేని కరెంట్, సాగు, తాగునీటి సమస్యలు కాంగ్రెస్ సర్కారులో మళ్లీ మొదలయ్యాయన్నారు. హామీల అమలులో కాంగెస్ పార్టీ విఫలమైందని చెప్పారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ధరలు పెంచి పేదలపై అధిక భారం మోపిందని విమర్శించారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వల్లపురెడ్డి, నాయకులు ముత్యంరావు, గోవర్ధన్, శ్రీనివాస్, మహేందర్, రామకృష్ణ పాల్గొన్నారు.

# అకాల వర్షం.. అతలాకుతలం

- ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఈదురుగాలుల వర్షం
- విరిగిన చెట్లు, కూలిన విద్యుత్ స్తంభాలు
- నేలరాలిన మామిడి కాయలు, నిమ్మకాయలు
- పిడుగుపాటుకు ఒకరు దుర్మరణం.. ఎనిమిది పశువులు మృతి
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- వర్షానికి చల్లబడిన వాతావరణం



నల్లగొండలో కురుస్తున్న వర్షం

### 5 గంటలు నిలిచిన కరెంట్ సరఫరా

నల్లగొండ సిటీ, మే 5 : ఈదురు గాలుల వర్షానికి నల్లగొండ పట్టణంలో సుమారు 5 గంటలపాటు కరెంట్ సరఫరా నిలిచింది. సాయంత్రం 5 నుంచి రాత్రి 9 : 30 గంటల వరకు విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేశారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్లను తొలగించక పోవడంతో ఈ సమస్య ఏర్పడింది. గతంలో ఎప్పటికప్పుడు అధికారులు చర్యలు తీసుకోవడంతో గాలిదుమారాలు వచ్చినా కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడలేదు.



సూర్యాపేటలో తాటిచెట్టు మీద పడిన పిడుగు

నల్లగొండ/చిట్యాల/శాలిగౌరారం/మర్రిగూడ/ఆత్మకూర్.ఎస్./తిరుమలగిరి /బొడ్రాయిబజార్/నాగారం మే 5 : గాలిదుమారంతో కూడిన వర్షం అతలాకుతలం చేసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులు కురిశాయి. పిడుగుల వర్షం పడింది. ఈదురుగాలులకు పలు చోట్ల ఇంటిపైకప్పు రేకులు ఎగిరి పడ్డాయి. చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. తోటల్లో మామిడి కాయలు, నిమ్మకాయలు కింద రాలాయి. పిడుగుపాటుకు ఒక వ్యకి చనిపోయాడు. ఎనిమిది పశువులు మృత్యువాత పడ్డాయి. తాటి, కొబ్బరి చెట్లపై పిడుగులు పడి మంటలు చెలరేగాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. ఈ వర్షం ప్రజలతోపాటు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. అడ్డగూడూరు మండలం కోటమర్తిలో పిడుగుపాటు వ్యక్తి చనిపోయాడు. ఒక బర్రె మృతి చెందింది. గుండాల మండలం తుర్కలషాపురం ఒక బర్రె, వలిగొండ మండలం వెంకటాపురంలో ఒక ఆవు, సంస్థాన్ నారాయణపురం మండలం గుజ్జలో రెండు ఆవులు, ఆత్మకూర్.ఎం మండలం పారుపల్లిలో ఒక ఎద్దు, చండూరు మండలం ఉడుతపల్లిలో ఆవు పిడుగుపాటుకు మృతి చెందాయి. వర్షంతో వాతావరణం చల్లబడగా ఎండ వేడిమి నుంచి జనం ఉపశమనం పొందారు.



మర్రిగూడ మండలం తిరుగండ్లపల్లిలో చెట్టు కూలి ధ్వంసమైన కారు



నాగారంలో ఈదురు గాలులకు లేచిపోయిన ఇంటి పైకప్పు



చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో కూలిన హోర్డింగ్



పిట్టంపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

## కాంగ్రెస్, బీజేపీలను నమ్మొద్దు

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని ప్రచారం

కట్టంగూర్, మే 5 : కాంగ్రెస్, బీజేపీ మాయమాటలు నమ్మి మోసపోద్దని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని కోరుతూ మండలంలోని పామనుగుండ్ల, పిట్టంపల్లి గ్రామాల్లో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలను తుంగలో తొక్కిందన్నారు. ఐదు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేక మొదలైందని, బీఆర్ఎస్ తెచ్చిన రైతుబంధును నిర్వీర్యం చేసిందని, రైతులకు కరెంట్ కష్టాలు తెచ్చిపెట్టిందని విమర్శించారు. ప్రజలను మోసం చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డిని మించిన నాయకుడు లేడన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తరాల బలరాములు, నాయకులు పోగుల నర్సింహ, జానీపాషా, వడ్డె సైదిరెడ్డి, పసన సైదులు, గుండగోని రాములు, రవి, శ్రీను, దేవేందర్, భిక్షం, నర్సింహ పాల్గొన్నారు.

# డిగ్రీలో చేరాలంటే 'దోస్త్' కట్టాల్సిందే..

- నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ఉన్నత విద్యామండలి
- నేటి నుంచి ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు.. ఈ నెల 25 వరకు తొలి విడుత గడువు
- అందుబాటులో దోస్త్ వెబ్ సైట్, దోస్త్ మొబైల్ యాప్
- మూడు విడుతల్లో అడ్మిషన్ల ప్రవేశాల ప్రక్రియ
- జూలై 7తో అడ్మిషన్లు పూర్తి.. 8 నుంచి తరగతులు షురూ
- ఎంజీయూ పరిధిలో 83 కళాశాలలు.. 30వేల అడ్మిషన్లు

రామగిరి, మే 5 : రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కోర్సులో చేరాలంటే 'దోస్త్' కట్టాల్సిందే. డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ల పారదర్శకత కోసం 2016 నుంచి రాష్ట్ర ఉన్నత విద్యామండలి డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)ను అందుబాటులోకి తెచ్చింది. దీనికి సంబంధించి 2024-25 సంవత్సరానికి నోటిఫికేషన్ జారీచేసింది. రాష్ట్రంలో నచ్చిన యూనివర్సిటీ పరిధిలో కళాశాలలను ఎంపిక చేసుకుని అడ్మిషన్ పొందేందుకు చక్కటి దిక్సూచి 'దోస్త్'. తొలి విడుత అడ్మిషన్లకు ఈ నెల 6నుంచి ఈ నెల 25 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించింది. మూడు విడుతల్లో జరిగే అడ్మిషన్ల ప్రక్రియ జూలై 7తో ముగియనుంది. ఆ వెంటనే తొలి సెమిస్టర్ తరగతులు జూలై 8 నుంచి ప్రారంభమవుతాయి. విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్‌తోపాటు దోస్ మొబైల్ యాప్‌లో కూడా ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు చేసుకునే అవకాశం ఉంది. మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 83 కళాశాలల్లో 30వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. గతేడాది 53 శాతం సీట్లు మాత్రమే నిండాయి. దోస్త్‌పై సందేహాలు, సూచనలకు ఎంజీయూతోపాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుతోపాటు తత్సమాన కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు డిగ్రీ ఆయా కోర్సులో చేరడానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

### రిజిస్ట్రేషన్ చేసుకోండిలా...

దోస్త్‌తో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలో ప్రవేశం పొందే అవకాశం ఉంది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి దోస్త్‌తో సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించింది. విద్యార్థులు తమ ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ లింక్ చేసుకోవాల్సి ఉంటుంది. http://dost.cgg.gov.in వెబ్‌సైట్‌లోగానీ DOST మొబైల్ యాప్‌లోగానీ లాగిన్ కాగానే దోస్త్ ఐడీ, పిన్ నంబర్ వస్తుంది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు విద్యార్థులు రూ. 200 క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించాలి. వీటిని ఉపయోగించి దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకోవాలి. ఓపెన్ అయిన సైట్‌లో యూనివర్సిటీ, కళాశాలల వారీగా ప్రాధాన్యత క్రమంలో కోర్సుల ఎంపిక, వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాలి. కోరుకున్న కళాశాలలో సీటు వస్తే సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా కన్ఫర్మేషన్ చేసుకోవాలి. ఏ దశ కౌన్సిలింగ్‌లో అయినా సెల్ఫ్ రిపోర్టింగ్ ఎంచుకున్న కళాశాలకు వెళ్లి అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు చూపించాలి. వారు అక్కడ అడిగిన సర్టిఫికెట్స్‌ను అందజేసి ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

### కళాశాలల ఎంపిక ఇలా..

విద్యార్థి ఏ కళాశాలలో, ఏ గ్రూప్‌లో చేరదల్చుకున్నాడో వాటిని ప్రాధాన్యత ప్రకారం ఎంపిక చేసుకోవాలి. ఎన్ని కళాశాలల్లో ఆ విద్యార్థికి సంబంధించిన కోర్సు ఉంటుందో వాటిని నమోదు చేసుకోవాలి. కళాశాలలు, గ్రూప్స్ ఎంపిక పూర్తి కాగానే సేవ్ బటన్ నొక్కితే వెంటనే సేవ్ అయిపోతుంది. అప్పుడు ఏ కళాశాలల్లో దరఖాస్తు చేసుకున్నామో అందుకు సంబంధించిన పత్రాలు జనరేట్ అవుతాయి. వాటిని ప్రింట్ కూడా తీసుకోవచ్చు.




దోస్త్ వెబ్‌సైట్ ఫొటో

### ముఖ్యమైన తేదీలు ఇవే..

- డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్లకు ఫేజ్ -1 ఈ నెల 6 నుంచి 25 వరకు అవకాశం
- ఈ నెల 15 నుంచి 27 వరకు కళాశాలల ఎంపికకు వెబ్ ఆప్షన్స్
- జూన్ 3న వెబ్ ఆప్షన్ ఇచ్చిన విద్యార్థులకు తొలి విడుత సీటు అలాట్‌మెంట్
- జూన్ 4 నుంచి 10 వరకు అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో (కళాశాల ఫీజు, సీటు రిజ్వరేషన్ ఫీజు చెల్లించి) చేరడానికి ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి.
- జూన్ 4నుంచి 13 వరకు రూ. 400 చెల్లించి రెండో ఫేస్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్స్, వెబ్ ఆప్షన్స్
- జూన్ 4 నుంచి 14వరకు కళాశాలల ఎంపికకు వెబ్ ఆప్షన్స్
- జూన్ 18న రెండో లిస్టులో సీటు అలాట్‌మెంట్ వివరాలు విడుదల
- రెండో లిస్టులో సీటు వచ్చిన విద్యార్థులు జూన్ 19 నుంచి 24 వరకు కళాశాలల్లో రిపోర్టు చేయాలి
- జూన్ 19నుంచి 25 వరకు మూడో విడుత రూ. 400 చెల్లించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. 19 నుంచి 26వరకు వెబ్ ఆప్షన్స్
- జూన్ 29న ఫైనల్ (మూడో విడుత) సీటు అలాట్‌మెంట్ విడుదల
- చివరి లిస్టులో సీటు వచ్చిన విద్యార్థులు జూన్ 29 నుంచి జూలై 3వరకు ఆయా కళాశాలల్లో రిపోర్టింగ్ చేయాలి.
- ఫేజ్ 1, 2, 3లో సీటు వచ్చి ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి సీటు నమోదు చేసిన విద్యార్థులు జూన్ 29నుంచి జూలై 5లోగా ఆయా కళాశాలలో చేరడానికి అవకాశం
- జూలై 1 నుంచి 6వరకు డిగ్రీలో చేరిన విద్యార్థులకు ఆయా కళాశాలలో ఓరియంటేషన్ ఉంటుంది.
- జూలై 8నుంచి సెమిస్టర్ -1 తరగతులు మొదలవుతాయి.

### దోస్త్‌లో డిగ్రీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



ఎంజీయూ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలలో డిగ్రీలో చేరడానికి నోఫిటిఫికేషన్ విడుదలైంది. అర్హులైన విద్యార్థులంతా దోస్త్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దోస్త్ అడ్మిషన్లలో సందేహాల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. రిజిస్ట్రేషన్ చేసే క్రమంలో ఏమైనా తప్పులు జరిగితే వర్సిటీ హెల్ప్‌లైన్ సెంటర్‌కు వచ్చి సవరణ చేసుకునే అవకాశం ఉంది. సందేహాలకు వర్సిటీ హెల్ప్‌లైన్ సెంటర్స్‌లోగానీ, నా ఫోన్ నంబర్ 99483 61250లోగానీ సంప్రదించవచ్చు.

– ఆకుల రవి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, ఎంజీయూ

### అడ్మిషన్ల కోసం ఉచిత సేవలు అందిస్తున్నాం



దోస్త్ ద్వారా డిగ్రీలో అడ్మిషన్లు పొందే విద్యార్థులకు ఉచిత సేవలు అందిస్తున్నాం. నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల, ఐడియల్ కళాశాలలో హైల్ప్‌లైన్ సెంటర్స్ అందుబాటులో ఉంచుతున్నాం. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 11 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, రెండు ఎయిడెడ్ కళాశాలలున్నాయి. వీటిల్లో అన్ని రకాల మౌలిక వసతులతోపాటు నిపుణులైన అధ్యాపకులు ఉన్నారు.

– సముద్రాల ఉపేందర్, ప్రిన్సిపాల్, ఎన్జీ కళాశాల, నల్లగొండ